క్లుప్తంగా

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు


పుష్ప (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని మడిబాకలో మహిళ అదృశ్యంపై ఆదివారం ఫిర్యాదు అందినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఆర్కాడ్‌కు చెందిన పుష్ప(20) ఏర్పేడు మండలం మడిబాక గ్రామంలో తన పెద్దమ్మ మనీలమ్మ ఇంట్లో వారం రోజులుగా ఉంటోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి అదృశ్యమైంది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఎరుపు రంగు కలిగి 5 అడుగులు ఎత్తు, స్కై బ్లూ కలర్ పంజాబీ డ్రస్, బ్లాక్ ప్యాంట్ వేసుకున్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 9440900729 నంబరుకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

శ్రీకాళహస్తి: పట్టణంలోని నగరవీధిలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వైమానికదళ ఎయిర్ కమాండర్ శెట్టిపల్లి శ్రీనివాస్ హాజరై సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 139 నెలలుగా పట్టణంలోని పేదలకు, ప్రత్యేక ప్రతిభావంతులకు సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. టౌన్‌బ్యాంక్ చైర్మన్ శెట్టిపల్లిసురేష్, శెట్టిపల్లి సుబ్రహ్మణ్యం, రాము, సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, రాజేశ్వరరావు, కోళ్లూరు హరినాథ్, ఢిల్లీకుమార్, బాబా ఫరీద్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని 7వ వార్డుకు చెందిన ఆర్కాడు గోపిశెట్టి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పార్టీ నాయకులను అక్కడికి పంపించారు. గోపిశెట్టి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రేపు వెంగళత్తూరులో జగనన్న సురక్ష

పిచ్చాటూరు: మండలంలోని వెంగళత్తూరు సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారని తెలిపారు. అన్నీ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు తారకరామానగర్‌లో గడప గడపకు..

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు.

మర్కస్ జమీయా మసీదు నూతన కమిటీ

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని మర్కస్ జమీయా మసీదు (పెద్ద మసీదు)కు నూతన కమిటీని ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ సిద్దిక్, గౌరవ అధ్యక్షుడిగా మొహిద్దీన్, ఉపాధ్యక్షుడిగా సల్లావుద్దీన్, అధికార ప్రతినిధిగా నయీం ముల్లా, ప్రధాన కార్యదర్శిగా ఫజుల్ రెహమాన్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంయుక్త కార్యదర్శిగా మల్లం కబీరుల్లా, కోశాధికారిగా ఇలియాస్ బాషా, గౌరవ సలహాదారులుగా అన్వర్, సుభహాన్, పీఆర్వోగా అబ్దుల్, సభ్యులుగా అల్తాఫ్ మొహిద్దీన్, అక్బర్ బాషా, ఫిరోజ్ ఖాన్, రియాజ్, జాఫర్ అలీ, షాహుల్, అమీద్, గయాజ్, జాఫర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు సిద్దిక్ తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ఏర్పేడు: మండలంలోని పల్లంపేట, పల్లం గ్రామాల్లో త్రైత సిద్ధాంతం ప్రబోధ హిందూ జ్ఞానవేదిక శ్రీకాళహస్తి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి త్రైత సిద్ధాంతం భగవద్గీతను చదవాలని సూచించారు. కార్యక్రమంలో సురేష్, లీలాకృష్ణ, సుధ, శ్రీనివాసులు, అమరావతి, మధుకిరణ్, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాల సంక్షేమం


ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- రామచంద్రాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

శ్రీకాళహస్తి: జగనన్న పాలనలో అన్ని వర్గాలు లబ్ధిపొందుతున్నాయని.. మళ్లీ ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. తొట్టంబేడు మండలం రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే చెప్పండి తల్లీ అంటూ ఎమ్మెల్యే కోరారు. మీ సమస్యలు పరిష్కరించడానికే గడప గడపకు వస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ పాలన

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమానికి పథకాలు తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని.. గడప గడపలో వస్తున్న ఆదరణే అందుకు ఉదాహరణ అన్నారు. తమకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

తొట్టంబేడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అహ్మద్ షరీఫ్, అక్బర్, సద్దాంహుస్సేన్, మోహన్ ఉన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ఏర్పేడు: మండలంలోని బాలకృష్ణాపురంలో వైస్ ఎంపీపీ జమ్మళ్ల శ్రీనివాసులు కుమార్తె అఖిల, నాగరాజు వివాహ నిశ్చయ వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, శ్రీవాణిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి బంగారు ఆభరణాన్ని బహూకరించారు. సర్పంచ్ పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జీపీ యాదవ్, గురునాథం, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టండి


పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న తెలుగుగంగ బ్రాంచ్ కాలువ

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు, యానాదివెట్టు గ్రామాల మీదుగా సూళ్లూరుపేటలోని మాంబట్టు కెనాల్ వరకు వెళ్లే తెలుగుగంగ 9బి బ్రాంచ్ ఉపకాలువలో పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ కాలువ నుంచి మండల పరిధిలో 15 గ్రామాలకు చెందిన సాగునీటి చెరువులకు గంగనీరు వెళ్లాల్సి ఉంది. 2005లో ఏర్పాటైన ఉపకాలువలో ఇప్పటి వరకు పూడికతీత పనులు చేపట్టలేదు. దీంతో కాలువ పొడవునా పిచ్చి మొక్కలు, గడ్డి ఏపుగా పెరగడంతో కాలువలో నీరు సాఫీగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీని కారణంగా చెరువులకు నీరు మళ్లింపు ఇబ్బందికరంగా ఉందని రైతులు వాపోతున్నారు. రైతుల అవసరాలకు ఎంతగానో ఉపయోగపడాల్సిన ఉపకాలువ గురించి తెలుగుగంగ అధికారులు చొరవ చూపి పూడికతీత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సర్కారు విద్యకు ప్రభుత్వం చేయూత

విద్యార్థులకు సెమిస్టర్–2 పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ విష్ణుప్రియ

పిచ్చాటూరు: మండలంలోని అడవికొడియంబేడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలను జెడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యార్థులకు వివిధ పథకాల ద్వారా చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. నాడు–నేడు పథకం ద్వారా కోట్లు వెచ్చించి సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిందన్నారు. అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు, జగనన్న విద్యాకానుక ద్వారా యూనిఫాం, షూస్, స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను అందిస్తోందన్నారు. వీటితో పాటు బైజూస్ కంటెంట్ ద్వారా పాఠాలు, డిజిటల్ క్లాస్‌లు, ఇంగ్లిష్ మీడియం వంటి మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మేరీ, ఎంఈఓ యుగంధర్ రాజు, హెచ్‌ఎం ప్రకాష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ


దుస్తులు, విద్యాసామగ్రి అందజేస్తున్న మునిశేఖర్

శ్రీకాళహస్తి: మండలంలోని రామాపురం, రామలింగాపురం, భైరవ ఎస్టీకాలనీల్లోని పేద విద్యార్థులకు యువనేస్తం అసోసియేషన్ దుస్తులు, విద్యాసామగ్రి అందజేసింది. సంస్థ అధ్యక్షుడు మునిశేఖర్ మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి కోసం పని చేయడమే యువనేస్తం అసోసియేషన్ లక్ష్యమన్నారు. గిరిజన పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అందు కోసమే తమ వంతు సాయంగా సాయంత్రం పూట బడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మండల కోఆర్డినేటర్ నాగమణి, వలంటీర్లు వెంకటేష్, హేమలత పాల్గొన్నారు.

భరద్వాజ తీర్థంలో పూజలు చేసుకోవచ్చు

–అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: భరద్వాజతీర్థంలో కులదేవతలకు పూజలు చేసుకోవచ్చని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కొందరు స్థానిక భక్తులు భరద్వాజ తీర్థంలో కులదేవతలకు పూజలు చేసుకోవడానికి రాగా అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని హిందూ ధార్మికమండలి సభ్యుడు గరికపాటి రమేష్‌బాబు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అంజూరు తారక శ్రీనివాసులు అక్కడ విధుల్లో ఉన్నవారిని స్థానిక భక్తులపై ఎలాంటి ఆంక్షలు విధించవద్దని ఆదేశించారు. స్థానికులు తరతరాలుగా భరద్వాజ తీర్థంలో కులదేవతలకు పూజలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పుట్టువెంట్రుకలు, శుభకార్యాలకు అక్కడికి వచ్చి పూజలు చేసుకుంటారన్నారు. అలాంటి వారికి పూజలు చేసుకునేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే కొంతమంది భక్తులు జంతుబలులకు అనుమతి కోరుతున్నారని.. దేవదాయ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి వచ్చిన తరువాత పరిశీలిస్తామన్నారు. భరద్వాజ తీర్థంలో కులదేవతలకు పూజలు చేసుకునేందుకు వస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని అక్కడ విధులు నిర్వహించేవారిని ఆదేశించారు. ఎవరైనా ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మనో వికాసమే ప్రగతికి సోపానం


పుస్తకాలను అందజేస్తున్న దొరైరాజ్

శ్రీకాళహస్తి: మనోవికాసమే ప్రగతికి సోపానమని ప్రముఖ మనోవికాస నిపుణుడు దొరైరాజ్ అన్నారు. పట్టణంలోని తెలుగు గంగకాలనీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఆదివారం యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మనోవికాసంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా దొరైరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ముందస్తు ప్రణాళిక అవసరమన్నారు. లక్ష్య సాధనతో ముందుకు వెళితే విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు దొరైరాజ్ రచించిన శిఖరాగ్ర స్థాయికి చేరుకోవాలనుందా అనే పుస్తకాలు, చెప్పులను పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు హేమకుమార్, ప్రిన్సిపల్ లలితమ్మ, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరువు కట్ట ఆధునీకరణ పనులు


జేసీబీతో చెరువు కట్ట ఆధునీకరణ పనులు

ఏర్పేడు: మండల కేంద్రంలో చెరువు కట్ట ఆధునీకరణ పనులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో ముమ్మరంగా జరుగుతున్నాయి. టీడీపీ హయాంలో అప్పటి నాయకులు నాసిరకంగా చెరువు కట్ట పనులు చేసి రూ.లక్షలు స్వాహా చేశారు. కట్ట బలహీన పడడంతో వర్షాకాలంలో చెరువుకు చేరిన నీళ్లు వృథా అయ్యేవి. దీంతో రైతులు వేసిన వరి ఆఖరి దశలో ఎండిపోయేది. చెరువు కట్ట కింద 750 ఎకరాల ఆయకట్టు ఉంది. నాలుగేళ్లుగా రైతులు వ్యవసాయం సాగుచేసి నష్టపోతున్నారు. ఇటీవల స్థానిక సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మెగా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడారు. సుమారు రెండు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన చెరువు కట్టపై దట్టంగా ఉన్న ముళ్లచెట్లను తొలగించారు. ట్రాక్టర్ల ద్వారా కట్టకు మట్టిని తోలి ఎత్తును పెంచి జేసీబీతో చదును చేసి బలోపేతం చేస్తున్నారు. కట్ట బాగుపడుతుండడంతో రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

రేణిగుంట: తిరుపతి సైన్స్ సెంటర్‌లో వారం రోజుల పాటు నిర్వహించిన క్విజ్ పోటీల్లో రేణిగుంటకు చెందిన డాక్టర్ బషీర్స్ తపస్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్కూల్ అధినేత విక్రమ్ శాలీ, డైరెక్టర్ కె.అనూష తెలిపారు. టీం క్విజ్ పోటీలో మొత్తం 28 స్కూళ్ల నుంచి 158 మంది విద్యార్థులు పోటీపడగా, తమ విద్యార్థులు వర్షిణి, ప్రణీత్‌శ్రీ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అలాగే ఓపెన్ క్విజ్ పోటీల్లో జషువర్ధన్, ప్రణీత్‌శ్రీ, సంతోష్, జశ్వంత్, నాగసాయి జోషి, మహీధర్, వ్యక్తృత్వ పోటీల్లో వర్షిణి, మోహిత్, జషువర్ధన్, పెయింటింగ్‌లో సమరదీప్ ప్రతిభ కనబరచినట్లు వెల్లడించారు. వీరికి తుడా కార్యదర్శి లక్ష్మి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందించారు.

గ్రామాల్లో ముమ్మరంగా ఓటర్ల సవరణ


కుక్కలగుంటలో సర్వే చేస్తున్న బీఎల్‌ఓ

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఓటర్ల సవరణ సర్వే ముమ్మరంగా జరిగింది. మండల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ శివప్రసాద్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఆదివారం సైతం విధులు నిర్వహించారు. ఓటర్ల నమోదు ప్రక్రియతో పాటు వివాహం చేసుకుని వెళ్లిన మహిళలు, మృతి చెందిన ఓటర్ల పేర్లను తొలగించారు. జూలై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు సర్వే జరుగనుంది.

పకడ్బందీగా ఓటర్ల సర్వే

పిచ్చాటూరు: మండలంలో ఓటర్ల సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మధుసూదన్‌రావు తెలిపారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21 నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తామన్నారు. బీఎల్‌ఓలు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. అలాగే మరణించిన, గ్రామం వదిలి శాశ్వతంగా వెళ్లిపోయిన వారి ఓట్లు తొలగింపుతో పాటు ఓటర్ల జాబితాలో సవరణలు చేపడతారన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


సినీ రచయిత విజయేంద్రప్రసాద్

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎంపీ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యే నవాజ్ బాష, సినీ రచయిత విజయేంద్రప్రసాద్, బేబీ సినిమా చిత్ర పరిశ్రమ యూనిట్, హీరో ఆనంద్ దేవరకొండ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

పర్యావరణ రక్షణ మన బాధ్యత


మొక్కలతో రైల్వే పోలీసులు

తిరుపతి అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని తిరుపతి రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ వెల్లడించారు. తిరుపతి వెస్ట్ ఆర్పీఎఫ్ బ్యారెక్స్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా చెట్లను నరికేయడంతో వాతావరణం కలుషితం అవుతోందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి తమ వంతు కృషి చేయాలని కోరారు.

తుది దశలో శ్రీనివాస సేతు పనులు

తిరుపతి తుడా: శ్రీనివాస సేతు పనులు తుది దశకు చేరుకున్నాయని, ఆగస్టు మొదటి వారంలో పనులు పూర్తయి అందుబాటులోకి తీసుకువస్తామని స్మార్ట్ సిటీ ఎండీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె ఆదివారం రిలయన్స్ మార్ట్ వద్ద రైల్వే లైన్‌పై చేపట్టిన శ్రీనివాస సేతు నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ


ఆరూరులో గతంలో ఉన్న మట్టి రోడ్డు


నూతనంగా వేసిన సిమెంట్ రోడ్డు

- రోడ్ల అభివృద్ధికి రూ.2 కోట్లు,
- నీటి వసతి, మురుగు కాలువలకు రూ.58 లక్షలు మంజూరు

సత్యవేడు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి రూ. 2.58 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. వాటితో ఆయా గ్రామాల్లో సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మండల పరిధిలో ఆరూరులో రూ.15 లక్షలు, రాచపాళెంలో రూ.8 లక్షలు, చెరివిలో రూ. 6 లక్షలు మంజూరు కావడంతో ఆయా గ్రామాల్లో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు కాలువలు, బోర్లు ఏర్పాటు

మండల పరిధిలో బోర్లు, మురుగునీటి కాలువల అభివృద్ధికి రూ.58 లక్షలు మంజూరు కావడంతో నిర్మాణాల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మల్లవారి పాళెంలో బోరు, పైప్‌లైన్ ఏర్పాటుకు రూ. 3లక్షలు, కాళమనాయుడుపేటలో బోరు, పైప్‌లైన్‌కు రూ. 2లక్షలు, నరసరాజు అగ్రహారంలో బోరు, మోటారు ఏర్పాటుకు రూ. 3 లక్షలు, పుదుకుప్పంలో మురుగుకాలువ నిర్మాణానికి రూ.4 లక్షలు, జడేరిలో మురుగు కాలువ నిర్మాణానికి రూ.4 లక్షలు, రాజగోపాలపురంలో మురుగు కాలువ, వంతెన ఏర్పాటు కోసం రూ.10 లక్షలు మంజూరు కావడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.